సాక్షి కామారెడ్డి

బుధవారం । 5 । జూన్ । 2024



కల్లాలను నిర్మిస్తాం

కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్ మంగళవారం పలు గ్రామాలలో పర్యటించారు. కల్లాల నిర్మాణంపై రైతులతో చర్చించారు.

- IIIలో ▸



'సాగర్' కాలువకు బుంగ

మహమ్మద్‌నగర్ మండల కేంద్ర శివారులో నిజాంసాగర్ ప్రధాన కాలువకు మంగళవారం బుంగ పడి నీరు వృథా అయ్యింది.

- IIIలో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.7 /24.7

ఉదయం నుంచి ఆకాశం పాక్షికంగా మేఘావృతం అవుతుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

జహీరాబాద్‌షా.. సురేశ్ షెట్కార్

జహీరాబాద్ ఎంపీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేశ్‌కుమార్ షెట్కార్ విజయం సాధించారు. సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్‌పై 46,188 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. నియోజకవర్గంలో మొత్తం 16.41 లక్షల ఓట్లు ఉండగా 12.25 లక్షల ఓట్లు పోలయ్యాయి. ఇందులో సురేశ్ షెట్కార్‌కు 5,28,418 ఓట్లు రాగా, బీజేపీ నుంచి బరిలోకి దిగిన బీబీ పాటిల్‌కు 4,82,230 ఓట్లు వచ్చాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ 1,72,078 ఓట్లతో మూడో స్థానానికి పరిమితమయ్యారు.

- కాంగ్రెస్‌ను వరించిన విజయం
- బీజేపీ అభ్యర్థిపై 46,188 ఓట్ల తేడాతో గెలుపు
- మూడో స్థానానికి పడిపోయిన బీఆర్‌ఎస్



ప్రొఫైల్..

పేరు	: సురేశ్ కుమార్ షెట్కార్
పుట్టిన తేదీ	: 08.08.1960
విద్యార్హత	: బీఎస్సీ
తండ్రి	: శివరావ్ షెట్కార్, ఖేడ్ మాజీ ఎమ్మెల్యే
తల్లి	: చంద్రమ్మ షెట్కార్
భార్య	: ఉమాదేవి షెట్కార్
కూతుళ్లు	: డాక్టర్ గిరిజ షెట్కార్, శివానీ షెట్కార్
కుమారుడు	: రాకేశ్ షెట్కార్


సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ మంగళవారం పటాన్‌చెరు మండలం రుద్రారంలోని గీతం యూనివర్సిటీలో జరిగింది. ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమైన ఓట్ల లెక్కింపు ప్రక్రియ రాత్రి వరకు కొనసాగింది. పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో పాటు, ఈవీఎం ఓట్లను లెక్కించారు. మొత్తం 23 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరపగా.. తొలి రౌండ్ నుంచి మొదలుకుని చివరి రౌండ్ వరకు ప్రతి రౌండ్‌లోనూ షెట్కార్ ఆధిక్యం సాధించారు. 46,188 ఓట్ల మెజారిటీతో గెలిచారు. జహీరాబాద్ పార్లమెంట్ స్థానం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి ధ్రువీకరణ పత్రం అందజేశారు.

3.73 శాతం ఓట్ల తేడా..

ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బీజేపీకంటే కేవలం 3.73 శాతం ఓట్లు ఎక్కువగా వచ్చాయి. బీజేపీ అభ్యర్థి పాటిల్‌కు 39 శాతం ఓట్లు రాగా, షెట్కార్ 42.73 శాతం ఓట్లు సాధించారు. మూడో స్థానంలో నిలిచిన గాలి అనిల్‌కు 13.92 శాతం ఓట్లు వచ్చాయి.



సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న సురేశ్ షెట్కార్



ప్రధాన పార్టీల అభ్యర్థులకు వచ్చిన ఓట్లు

అందరి కృషి ఫలితమే..

కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తల కృషితోపాటు అన్ని వర్గాల ప్రజల ఆశీస్సులతోనే ఎంపీగా రెండో పర్యాయం విజయం సాధించానని సురేశ్ షెట్కార్ పేర్కొన్నారు. విజయం సాధించిన అనంతరం కౌంటింగ్ కేంద్రం బయట ఆయన మీడియాతో మాట్లాడారు. 2009 నుంచి 2014 వరకు తాను ఎంపీగా ఉన్నానని, ఆ సమయంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే విషయంలో కీలకంగా వ్యవహరించానని గుర్తు చేశారు. తన గెలుపు కోసం కృషి చేసిన, ఓట్లు వేసి గెలిపించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

పదేళ్ల తర్వాత పార్లమెంట్‌కు..

సాక్షి, కామారెడ్డి: జహీరాబాద్ ఎంపీగా విజయం సాధించిన కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్.. పదేళ్ల విరామం తర్వాత మరోసారి పార్లమెంట్‌లో అడుగుపెట్టబోతున్నారు. ఆయనకు ఎంపీగా ఇది రెండో గెలుపు. పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన జరిగిన తర్వాత ఏర్పాటైన జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి 2009లో తొలిసారిగా ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన సురేశ్ షెట్కార్ అప్పటి మహాకూటమి అభ్యర్థి యూసుఫ్ అలీపై 17,407 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఐదేళ్ల పాటు ఎంపీగా కొనసాగిన సురేశ్ షెట్కార్ అందరు ఎంపీలతో కలిసి తెలంగాణ కోసం పార్లమెంట్ వేదికగా నినదించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత 2014 లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రెండోసారి ఎన్నికల బరిలో నిలిచిన సురేశ్ షెట్కార్.. అప్పటి టీఆర్‌ఎస్ అభ్యర్థి బీబీ పాటిల్ చేతిలో ఓడిపోయారు. 2018 లో ఆయన పార్లమెంట్‌కు కాకుండా నారాయణఖేడ్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉన్నారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నారాయణఖేడ్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా టికెట్టు ఖరారైనట్టే ఖరారై చివరి క్షణంలో చేజారింది. ఎంపీగా పోటీ చేయాలని పార్టీ నాయకత్వం నచ్చజెప్పింది. దీంతో ఎమ్మెల్యే ఎన్నికల్లో పార్టీ విజయం కోసం పనిచేశారు. ఈసారి జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మరోసారి బరిలో నిలిచారు. బీజేపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్‌తో గట్టి పోటీ ఎదుర్కొన్నా.. చివరకు ఘన విజయం సాధించారు.

న్యూస్‌రీల్

కేసులను వేగంగా పరిష్కరించాలి

- జిల్లా జడ్జి సీహెచ్‌వీఆర్ఆర్ వరప్రసాద్



కామారెడ్డి క్రైం: జాతీయ లోక్ అదాలత్‌లో గరిష్టంగా కేసులను పరిష్కరించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ డాక్టర్ సీహెచ్‌వీఆర్ఆర్ వరప్రసాద్ సూచించారు. ఇన్సూరెన్స్, సైబర్ నేరాలకు సంబంధించిన కేసుల పరిష్కారం కోసం మంగళవారం కామారెడ్డి కోర్టులో ఇన్సూరెన్స్ కంపెనీల స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ సైబర్ నేరాలలో ఎఫ్ఐఆర్ నమోదు కాని కేసులను ప్రీ లిటిగేషన్ కేసులుగా న్యాయ సేవాధికార సంస్థ పరిగణించి పరిష్కరిస్తుందన్నారు. కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఎఫ్ఐఆర్ చేసిన సైబర్ నేరాలను మాత్రం సంబంధిత పోలీస్ స్టేషన్‌ల ద్వారా కోర్టులలో పరిష్కరించుకోవచ్చన్నారు. సైబర్ క్రైం కేసుల్లో నష్టపోయిన బాధితులు వారి డబ్బు ఎలా రికవరీ చేసుకోవచ్చు అనే స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ గురించి వివరించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జి లాల్‌సింగ్ శ్రీనివాస్ నాయక్, సీనియర్ సివిల్ జడ్జ్ నాగరాణి, న్యాయవాదులు పాల్గొన్నారు.

జిల్లాలో ఓ మోస్తరు వర్షం



కామారెడ్డి క్రైం/రామారెడ్డి: జిల్లాలో మంగళవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. కొన్ని ప్రాంతాలలో బలమైన గాలులు వీచాయి. జిల్లాలో అత్యధికంగా రామారెడ్డిలో 41.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. కామారెడ్డిలో 24.5, భిక్కనూరులో 11.5, బీబీపేట్‌లో 6.3, పాతరాజంపేటలో 3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. రామారెడ్డి నుంచి కామారెడ్డి వైపు వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న పెద్దపెద్ద చెట్లు బలమైన గాలులకు నేలకూలాయి. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రామారెడ్డి పోలీసులు పొక్లెయిన్ సహాయంతో రోడ్డుపై పడిన భారీ వృక్షాలను తొలగించారు.

డిచ్‌పల్లిలో ఈదురు గాలులతో ఇబ్బందులు



డిచ్‌పల్లి: డిచ్‌పల్లిలోని సీఎంసీలో మంగళవారం కౌంటింగ్ జరుగుతున్న సమయంలో బలమైన గాలులు వీచాయి. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. వెంటనే అధికారులు స్పందించి జనరేటర్ ద్వారా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఈదురుగాలులకు కౌంటింగ్ కేంద్రం ఆవరణలో వేసిన టెంట్లు పడిపోయాయి.

నేటినుంచి చౌడేశ్వరి దేవి ఆలయ ఉత్సవాలు

రుద్రూర్: మండల కేంద్రంలోని చౌడేశ్వరి దేవి ఆలయ ఉత్సవాలను బుధ, గురువారాలలో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయంలో నిర్వహించే ప్రత్యేక పూజలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కామారెడ్డి, ఎల్లారెడ్డిలలో బీజేపీకే మొగ్గు

- జిల్లా రాజకీయాల్లో కీలకంగా ఉన్న కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లో బీజేపీకి మంచి మెజారిటీ వచ్చింది. కామారెడ్డి నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థికి 85,610 ఓట్లు, కాంగ్రెస్‌కు 66,527, బీఆర్‌ఎస్ అభ్యర్థికి 23,285 ఓట్లు వచ్చాయి. ఇక్కడ బీజేపీకి 19,083 ఓట్ల మెజారిటీ లభించింది.
- ఎల్లారెడ్డి నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థికి 79,335 ఓట్లు రాగా.. కాంగ్రెస్ అభ్యర్థికి 63,446, బీఆర్‌ఎస్ అభ్యర్థికి 20,715 ఓట్లు వచ్చాయి. ఇక్కడ కూడా బీజేపీ అభ్యర్థికి 15,889 ఓట్ల లీడ్ వచ్చింది.

జుక్కల్, బాన్సువాడలలో కాంగ్రెస్‌కు...

- బాన్సువాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థికి 66,063 ఓట్లు, బీజేపీ అభ్యర్థికి 57,200, బీఆర్‌ఎస్ అభ్యర్థికి 21,047 ఓట్లు వచ్చాయి. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థికి 8,863 ఓట్ల మెజారిటీ లభించింది. జుక్కల్‌లో కాంగ్రెస్‌కు 63,577 ఓట్లు, బీజేపీకి 61,832 ఓట్లు, బీఆర్ఎస్‌కు 20,747 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీకి 1,745 ఓట్ల స్వల్ప మెజారిటీ వచ్చింది. జుక్కల్ నియోజకవర్గంలోనే బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ సొంత ఊరు సిర్పూర్ ఉంది. దీంతో ఈ నియోజకవర్గంలో బీజేపీకి భారీ మెజారిటీ వస్తుందని అందరూ అంచనా వేశారు. కానీ ఫలితాలు తారుమారయ్యాయి.

కనిపించని కారు జోరు..

సాక్షి, కామారెడ్డి : అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయిన బీఆర్‌ఎస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో మరింత చతికిలపడింది. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ బీఆర్‌ఎస్ మూడో స్థానంతో సరిపెట్టుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కేసీఆర్‌కు 59,911 ఓట్లు రాగా, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు 23,255 ఓట్లు మాత్రమే వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికలకన్నా సగానికిపైగా తగ్గిపోయాయి. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి సురేందర్‌కు 62,655 ఓట్లు రాగా.. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థికి 20,715 ఓట్లే వచ్చాయి. బాన్సువాడ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల్లో పోచారం శ్రీనివాస్‌రెడ్డికి 76,278 ఓట్లు రాగా.. పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్ల సంఖ్య 21,047 కు తగ్గిపోయింది. జుక్కల్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి హన్మంత్ సింధేకు 63,337 ఓట్లు రాగా.. ఇప్పుడు ఆ పార్టీ ఎంపీ అభ్యర్థికి 20,747 ఓట్లు మాత్రమే రావడం గమనార్హం. అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క కామారెడ్డిలోనే గెలుపొందిన బీజేపీ ఇప్పుడు రెండుచోట్ల మొదటి స్థానంలో ఉండగా, మిగతా రెండుచోట్ల రెండో స్థానాన్ని ఆక్రమించింది.


తారుమారు..

జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో కలిపి మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి 1,72,766 ఓట్లు వచ్చాయి. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థికి 1,71,997 ఓట్లు వచ్చాయి. అప్పుడు బీజేపీకి వచ్చిన ఓట్లు, ఇప్పుడు బీఆర్‌ఎస్‌కు రావడం గమనార్హం.

బీజేపీ బలం రెట్టింపు...

అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కలిపి బీజేపీ అభ్యర్థులకు వచ్చిన మొత్తం ఓట్లు 1,45,774. పార్లమెంట్ ఎన్నికల్లో ఈ ఓట్ల సంఖ్య 2,83,545 కి పెరిగింది. అంటే బీజేపీ రెట్టింపు సంఖ్యలో ఓట్లు లభించాయన్న మాట.

నెరవేరని హ్యాట్రిక్ కల



సాక్షి, కామారెడ్డి: వరుసగా మూడోసారి విజయం సాధించి పార్లమెంట్‌లో అడుగుపెట్టాలనుకున్న బీబీ పాటిల్‌కు చుక్కెదురైంది. ఎంపీ ఎన్నికలలో ఓటమి ఎదురైంది. జహీరాబాద్ లోక్‌సభ నియోజక వర్గం నుంచి 2014, 2019 ఎన్నికల్లో వరుసగా రెండుసార్లు విజయం సాధించిన బీబీ పాటిల్.. మూడోసారి బీఆర్‌ఎస్ అభ్యర్థిగానే బరిలో నిలుస్తారని అందరూ భావించారు. అయితే చివరి నిమిషంలో ఆయన పార్టీ మారారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమి చెందడం, పార్టీ బలహీన పడడం, దేశంలో మోదీ హవా నడుస్తుండడంతో పార్లమెంట్ ఎన్నికలకు ముందు కారు దిగి, కాషాయ కండువా కప్పుకున్నారు. ఆ పార్టీ టికెట్టు దక్కించుకున్నారు. వాస్తవానికి జహీరాబాద్ లోక్‌సభ నియోజక వర్గం పరిధిలో బీజేపీకి పెద్దగా బలం లేదు. 2019 పార్లమెంట్‌ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి 1,38,947 ఓట్లు రాగా.. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీ అభ్యర్థులందరికీ కలిపి వచ్చిన ఓట్లు 1,72,766 మాత్రమే. ఎంపీగా విజయం సాధించాలంటే 5 లక్షల పైచిలుకు రావలసిందే. ఆ స్థాయిలో ఓట్లు సాధించడం సవాల్‌గా మారిన పరిస్థితుల్లో సర్వశక్తులు ఒడ్డినా ఫలితం దక్కలేదు. ఆయన సొంత నియోజకవర్గమైన జుక్కల్‌లో రెండో స్థానంలో నిలవగా.. అక్కడ కాంగ్రెస్ పార్టీకి స్వల్ప మెజారిటీ వచ్చింది. కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజక వర్గాల్లో మాత్రమే బీజేపీకి మెజారిటీ లభించింది. బాన్సువాడతోపాటు సంగారెడ్డి జిల్లాలోని అందోల్, నారాయణఖేడ్, జహీరాబాద్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు మెజారిటీ రావడంతో పాటిల్‌కు ఓటమి తప్పలేదు.

సొంతూరులో వెనుకంజ

మద్నూర్: బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ సొంతూరు సిర్పూర్‌లోనూ సత్తా చాటలేకపోయారు. ఈ గ్రామంలో బీబీ పాటిల్‌కు 348 ఓట్లు రాగా కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్‌కు 426 ఓట్లు వచ్చాయి. సిర్పూర్ ఓటర్లు కాంగ్రెస్‌కు 78 ఓట్ల ఆధిక్యత ఇచ్చారు.

షబ్బీర్, మదన్‌మోహన్‌లకు ఎదురుదెబ్బ


సాక్షి, కామారెడ్డి: ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ దాదాపు రెండు నెలల పాటు కామారెడ్డి నియోజకవర్గంలో మకాం వేసి చక్రం తిప్పారు. మండల స్థాయి ప్రజాప్రతినిధులు, నాయకులు, కుల సంఘాలు, యువజన సంఘాల ప్రతినిధులను కాంగ్రెస్ పార్టీలో చేర్పించారు. కొన్నిచోట్ల ఊళ్లకు ఊళ్లు షబ్బీర్‌అలీ దగ్గరికి వచ్చి తామంతా ఈసారి కాంగ్రెస్‌కు అండగా ఉంటామని ప్రకటించారు. అయితే ఎన్నికల ఫలితాలు అందుకు భిన్నంగా వచ్చాయి. కామారెడ్డి నియోజకవర్గంలో బీజేపీకి 19 వేల ఓట్ల మెజారిటీ లభించింది.

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు మెజారిటీ తెచ్చేందుకు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఊరూరా తిరిగారు. ఇతర పార్టీలనుంచి పెద్ద సంఖ్యలో నాయకులను పార్టీలో చేర్చుకున్నారు. భారీ మెజారిటీ వస్తుందని ధీమాతో పనిచేశారు. అయితే ఇక్కడ కూడా కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ తగిలింది. అసెంబ్లీ ఎన్నికల్లో మదన్‌మోహన్‌రావుకు 86,276 ఓట్లు వచ్చి 24,001 ఓట్ల మెజారిటీ రాగా.. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి 63,446 ఓట్లే పోలయ్యాయి. ఇక్కడ బీజేపీకి 15 వేల మెజారిటీ రావడం గమనార్హం.

కేవీఆర్‌కు నిరాశ

సాక్షి, కామారెడ్డి: అసెంబ్లీ ఎన్నికలలో ఇద్దరు ఉద్దండులను ఓడించి చరిత్ర సృష్టించిన కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్‌కు.. బీజేపీలో తగిన ప్రాధాన్యత లభించింది. ఆయనకు పార్టీ జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించింది. దీంతో ఆయన పార్టీ అభ్యర్థి గెలుపు కోసం శ్రమించారు. లోక్‌సభ నియోజకవర్గం అంతటా విస్తృతంగా పర్యటించారు. కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి వారిని ఎన్నికలకు సన్నద్ధం చేశారు. ప్రచార కార్యక్రమాలలో పాల్గొన్నారు. అయితే ఫలితాలు ఆయనకు నిరాశను కలిగించాయి. కామారెడ్డి, ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గాలలో బీజేపీకి మెజారిటీ వచ్చినప్పటికీ.. బాన్సువాడ, జుక్కల్‌లతోపాటు అందోల్, నారాయణఖేడ్, జహీరాబాద్‌లలో వెనకబడింది. దీంతో కాషాయ పార్టీ అభ్యర్థికి ఓటమి తప్పలేదు. బీబీ పాటిల్ ఓటమి ఎమ్మెల్యే కేవీఆర్‌ను నిరాశకు గురిచేసింది.

వికసిత కమలం



ఇందూరు గడ్డపై మరోసారి కాషాయం రెపరెపలు
ఘన విజయం సాధించిన ధర్మపురి అర్వింద్

- ఇందూరులో వరుసగా రెండోసారి బీజేపీ గెలుపు
- 1,09,241 ఓట్ల ఆధిక్యంతో సిట్టింగ్ ఎంపీ అర్వింద్ విజయం
- బాల్కొండ, ఆర్మూర్, నిజామాబాద్ రూరల్, కోరుట్ల సెగ్మెంట్లలో కమలానికి ఆధిక్యం
- జగిత్యాల, నిజామాబాద్ అర్బన్, బోధన్ సెగ్మెంట్లలో కాంగ్రెస్‌కు..

ఇందూరు పార్లమెంట్ గడ్డపై మళ్లీ కాషాయ జెండా రెపరెపలాడింది. సిట్టింగ్ ఎంపీ, బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ వరుసగా రెండోసారి విజయఢంకా మోగించారు. సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డిపై 1,09,241 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. అర్వింద్‌కు 5,92,318 ఓట్లు, జీవన్‌రెడ్డికి 4,83,077, బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డికి 1,02,406 ఓట్లు వచ్చాయి.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : డిచ్‌పల్లి సీఎంసీ కళాశాలలో మంగళవారం నిజామాబాద్ లోక్‌సభ స్థానం ఓట్ల లెక్కింపు నిర్వహించారు. ఉదయం 8 గంటలకు తొలుత పోస్టల్ బ్యాలెట్లు లెక్కించారు. అనంతరం నిజామాబాద్ పార్లమెంట్ స్థానం పరిధిలోని ఏడు సెగ్మెంట్లకు సంబంధించి కౌంటింగ్ నిర్వహించారు. నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, కోరుట్ల, జగిత్యాల సెగ్మెంట్లకు 15 రౌండ్లు, బోధన్, బాల్కొండ సెగ్మెంట్లలో 14 రౌండ్లు, ఆర్మూర్ సెగ్మెంట్‌లో 13 రౌండ్లు, పోస్టల్ బ్యాలెట్ ఓట్లను రెండు రౌండ్ల వారీగా లెక్కింపు చేశారు.

- అర్వింద్‌కు బాల్కొండ, ఆర్మూర్, కోరుట్ల, నిజామాబాద్ రూరల్ అసెంబ్లీ సెగ్మెంట్లలో ఆధిక్యత వచ్చింది. జీవన్‌రెడ్డికి జగిత్యాల, నిజామాబాద్ అర్బన్, బోధన్ సెగ్మెంట్లలో ఆధిక్యత వచ్చింది. ఇదిలా ఉండగా 2019 ఎన్నికల్లోనూ కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవితపై అనూహ్యంగా 70,267 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.
- 2023 నవంబర్‌లో జరిగిన రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో నిజామాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలోని ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్ స్థానాలను బీజేపీ గెలుచుకుంది. మొత్తం ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో కలిపి గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి 3,65,374 ఓట్లు వచ్చాయి. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో 4,79,748 ఓట్లు సాధించి విజయం సాధించిన అర్వింద్ తాజా ఎన్నికల్లో 5,92,318 ఓట్లు సాధించడం విశేషం.



ధ్రువీకరణ పత్రంతో ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్, బీజేపీ నేతలు

నాడు పసుపు బోర్డు హామీ, ఈసారి పసుపు బోర్డు మంజూరు..

2019 ఎన్నికల్లో అనూహ్యంగా బరిలోకి దిగిన అర్వింద్ అంచనాలన్నింటినీ తలకిందులు చేస్తూ అప్పటి సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె కవితపై విజయం సాధించారు. నిజామాబాద్‌కు పసుపు బోర్డు తీసుకొస్తానని హామీ ఇచ్చిన అర్వింద్.. ఏకంగా బాండ్ పేపర్ రాసిచ్చారు. దీంతో ఓటర్లు ఆదరించి విజయాన్ని కట్టబెట్టారు. ఈ నేపథ్యంలో 2023 శాసనసభ ఎన్నికలకు ముందు ఇందూరుకు వచ్చిన ప్రధాని మోదీ పసుపు బోర్డు మంజూరు చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటన చేశారు. దీంతో గత అసెంబ్లీ ఎన్నికల్లో, లోక్‌సభ స్థానం పరిధిలో రెండు అసెంబ్లీ స్థానాలు గెలవడంతో పాటు ఈసారి ఓట్ల సంఖ్యను భారీగా పెంచుకున్నారు. పైగా భారీ ఆధిక్యంతో విజయం సాధించారు.

ప్రశాంతంగా కౌంటింగ్


కౌంటింగ్ ఏజెంట్లను తనిఖీ చేస్తున్న పోలీసులు


కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు

- కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- ఐదు కిలోమీటర్ల వరకు పోలీస్ బందోబస్తు


సీఎంసీలో ఓట్లు లెక్కిస్తున్న సిబ్బంది


ఈవీఎం బాక్సులను తీసుకువస్తున్న సిబ్బంది


ప్రవేశద్వారాల వద్ద పోలీసుల బందోబస్తు

సుభాష్‌నగర్/డిచ్‌పల్లి: నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. పార్లమెంట్ నియోజకవర్గంలోని ఆర్మూర్, బోధన్, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బాల్కొండ, కోరుట్ల, జగిత్యాల అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో పోలైన ఓట్లను డిచ్‌పల్లిలోని సీఎంసీ కళాశాలలో కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య మంగళవారం లెక్కించారు. రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు నేతృత్వంలో జగిత్యాల కలెక్టర్ యాస్మిన్ బాషా, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, ట్రెయినీ కలెక్టర్ సంకేత్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు కౌంటింగ్ ప్రక్రియను ఆద్యంతం పర్యవేక్షించారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎలిస్ వజ్ ఆర్, లలిత్ కుమార్ ఓట్ల లెక్కింపు తీరును నిశితంగా పరిశీలించారు. ముందస్తు ప్రణాళికతో పకడ్బందీ ఏర్పాట్లు చేసిన ఫలితంగా ఎలాంటి అవాంతరాలకు తావులేకుండా ఓట్ల లెక్కింపు ప్రక్రియ సాఫీగా పూర్తయ్యింది. ఉదయం 5 గంటల నుంచే కౌంటింగ్ కోసం సన్నాహాలు చేపట్టారు. ఎన్నికల పరిశీలకులు, అభ్యర్థులు, వారి ఏజెంట్ల సమక్షంలో కలెక్టర్ నేతృత్వంలో కౌంటింగ్ సిబ్బంది మూడోవిడత ర్యాండమైజేషన్ నిర్వహించి, ఆ జాబితా ప్రకారంగా సిబ్బందిని ఆయా టేబుళ్ల వద్ద ఓట్ల లెక్కింపు బాధ్యతలు కేటాయించారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కించారు. ఈవీఎంలలో నమోదైన ఓట్లు లెక్కిస్తూ రౌండ్ల వారీగా ఫలితాలను వెల్లడించారు. ముందస్తుగానే టేబుళ్ల వారీగా కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సహాయకులు, సూక్ష్మ పరిశీలకులతోపాటు స్ట్రాంగ్ రూంల నుంచి వెంటనే ఈవీఎంలను కౌంటింగ్ హాళ్లకు తరలించేలా అవసరమైన సిబ్బందిని ఏర్పాటుచేశారు. మధ్యాహ్నం మూడు గంటలకే పోస్టల్ బ్యాలెట్లతోపాటు, పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు పూర్తి కాగా, అన్ని అంశాలను సరిచూసుకున్న తర్వాత రిటర్నింగ్ అధికారులు ఫలితాలను వెల్లడించారు. మొత్తం 29 మంది అభ్యర్థులు పోటీ చేయగా, ఒక్కో అభ్యర్థి వారీగా పోలైన ఓట్ల వివరాలు ప్రకటించారు. నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా గెలుపొందిన ధర్మపురి అర్వింద్‌కు పరిశీలకుల సమక్షంలో కలెక్టర్ ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.

రిటర్నింగ్ అధికారి రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, ఇతర ఉన్నతాధికారులు కౌంటింగ్ కేంద్రంలోనే ఉండి, ఓట్ల లెక్కింపు పూర్తయ్యేంత వరకు నిశితంగా పర్యవేక్షించారు. కౌంటింగ్ కేంద్రంతోపాటు పరిసర ప్రాంతాల్లో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి, 144 సెక్షన్ అమలు చేశారు. కౌంటింగ్ సిబ్బందితోపాటు వివిధ బాధ్యతలు నిర్వర్తించిన సిబ్బందిని క్షుణ్ణంగా తనిఖీలు చేసి పాస్‌లు కలిగిన వారిని పంపించారు.

2024 పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన ఓట్లను డిచ్‌పల్లిలోని సీఎంసీలో లెక్కించారు. మొత్తం 15 రౌండ్లకుగాను రౌండ్ల వారీగా మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు సాధించిన ఓట్లు..

క్రమసంఖ్య (రౌండ్‌వారీగా)	బీజేపీ (డి అర్వింద్)	బీఆర్ఎస్ (బాజిరెడ్డి గోవర్ధన్)	కాంగ్రెస్ (టి జీవన్‌రెడ్డి)	ఆధిక్యం
1	42,128	6,992	3,0522	11606 (బీజేపీ)
2	45,770	6,444	13,436	32,334 (బీజేపీ)
3	41,789	7,106	36,042	5,747 (బీజేపీ)
4	34,820	6,245	41,592	6,772 (కాంగ్రెస్)
5	37,369	6,896	39,938	2,569 (కాంగ్రెస్)
6	45,648	8,121	32,703	12,945 (బీజేపీ)
7	43,273	8,857	30,392	12,881 (బీజేపీ)
8	43,883	7,516	30,712	13,171 (బీజేపీ)
9	49,537	7,628	27,661	21,876 (బీజేపీ)
10	49,492	7,035	27,853	21,639 (బీజేపీ)
11	42,643	5,814	28,331	14,312 (బీజేపీ)
12	41,462	6,546	39,366	2,096 (బీజేపీ)
13	33,877	6,985	33,399	478 (బీజేపీ)
14	24,476	6,211	32,171	7,701 (కాంగ్రెస్)
15	6,990	2,828	11,469	4,479 (కాంగ్రెస్)
పోస్టల్	4,704	477	2,576	1,498 (బీజేపీ)

1952 నుంచి 2019 వరకు నిజామాబాద్ పార్లమెంట్ స్థానానికి 17 సార్లు ఎన్నికలు జరుగగా, ఎంపీలుగా గెలుపొందిన వారి వివరాలు..

1952 నుంచి ఇప్పటివరకు నిజామాబాద్ లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించిన ఎంపీలు

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	పార్టీ	పోలైన ఓట్లు	ఓడి అభ్యర్థి	పార్టీ
1952	హరీష్‌చంద్ర హెచ్	కాంగ్రెస్	86,619	కాశీనాథ్ రావు	సోషలిస్టు
1957	హరీష్‌చంద్ర	కాంగ్రెస్	1,10,646	జి.రాజారాం	సోషలిస్టు
1962	హరీష్‌చంద్ర	కాంగ్రెస్	1,06,570	ఎం.నారాయణరెడ్డి	స్వతంత్ర
1967	ఎం.నారాయణరెడ్డి	స్వతంత్ర	1,49,632	హరీష్‌చంద్ర	కాంగ్రెస్
1971	ఎం.రాంగోపాల్‌రెడ్డి	సి(జ)	1,55,323	కె.అనంత్‌రెడ్డి	టి.పి.ఎస్
1977	ఎం.రాంగోపాల్‌రెడ్డి	కాంగ్రెస్	2,52,291	ఎం.గంగారెడ్డి	టి.పి.ఎస్
1980	ఎం.రాంగోపాల్‌రెడ్డి	కాంగ్రెస్	2,48,283	కె.ఎం.ఖాన్	జె.పీ
1984	టి.బాలాగౌడ్	కాంగ్రెస్	2,51,164	ఎం.నారాయణరెడ్డి	టీడీపీ
1989	టి.బాలాగౌడ్	కాంగ్రెస్	2,94,340	పి.శ్రీనివాస్‌రెడ్డి	టీడీపీ
1991	జి.గంగారెడ్డి	టీడీపీ	2,57,297	టి.బాలాగౌడ్	కాంగ్రెస్
1996	జి.ఆత్మచరణ్‌రెడ్డి	కాంగ్రెస్	3,62,183	వెంకటేశ్వరరావు	టీడీపీ
1998	జి.గంగారెడ్డి	టీడీపీ	3,33,397	ఆత్మచరణ్‌రెడ్డి	కాంగ్రెస్
1999	జి.గంగారెడ్డి	టీడీపీ	3,73,260	సంతోష్‌రెడ్డి	కాంగ్రెస్
2004	మధుయాష్కీగౌడ్	కాంగ్రెస్	4,42,142	సయ్యద్ యూసుఫ్ అలీ	టీడీపీ
2009	మధుయాష్కీగౌడ్	కాంగ్రెస్	2,96,504	గణేష్‌గుప్త	బీఆర్ఎస్
2014	కల్వకుంట్ల కవిత	బీఆర్ఎస్	4,39,307	మధుయాష్కీగౌడ్	కాంగ్రెస్
2019	ధర్మపురి అర్వింద్	బీజేపీ	4,80,584	కల్వకుంట్ల కవిత	బీఆర్ఎస్


ఈవీఎం ఓట్ల లెక్కింపు..


పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు..


విజయచిహ్నం చూపుతున్న ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్, నాయకులు



ఓట్లు లెక్కిస్తున్న సిబ్బంది

ప్రజాతీర్పును గౌరవిస్తాం

సుభాష్‌నగర్/డిచ్‌పల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును కాంగ్రెస్ గౌరవిస్తుందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతి రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎలక్షన్ నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి కౌంటింగ్ ముగిసే వరకూ ఎండలను లెక్క చేయకుండా కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసిన కార్యకర్తలు, నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ నామమాత్రంగా పోటీ ఇచ్చిందని, మాజీ సీఎం కేసీఆర్ తన కుటుంబాన్ని, కవితను అవినీతి నుంచి కాపాడుకునేందుకు బీజేపీతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. ఫలితం కొన్ని స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఓటమి పాలయ్యారన్నారు. బీజేపీ మత విద్వేషాన్ని రెచ్చగొట్టి ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరించిందని విమర్శించారు. ఏదేమైనప్పటికీ ప్రజాతీర్పును గౌరవిస్తామని భూపతిరెడ్డి స్పష్టం చేశారు.



నైరుతి వచ్చేసింది..

- తొలకరి జల్లులతో మొదలైన సాగు పనులు
- పసుపు, మొక్కజొన్న విత్తుతున్న రైతులు


ఎస్సారెస్పీ ప్రాంతంలో కమ్ముకున్న మేఘాలు


ట్రాక్టర్ ద్వారా పసుపు విత్తనాలు వేస్తున్న రైతులు

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలోకి నైరుతి రుతుపవనాలు వచ్చేశాయి. మంగళవారం సాయంత్రం జిల్లా వ్యాప్తంగా తొలకరి జల్లులు పడ్డాయి. దీంతో రైతులు పంటల సాగుకు సమయాత్తమయ్యారు. ట్రాక్టర్లు, నాగళ్లకు పని చెబుతున్నారు. ఇప్పటికే పసుపు, మక్క పంట వేసేందుకు వ్యవసాయ భూములను దుక్కిదున్ని సిద్ధం చేసుకోగా, పలు ప్రాంతాల్లో విత్తనాలను శుద్ధి చేసి విత్తడం కూడా ప్రారంభించారు. అయితే, మార్కెట్‌లో పసుపు పంటకు మంచి ధర రావడంతో ఈ ఏడాది ఎక్కువ మొత్తంలో సాగు చేయడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో గతేడాది 20వేల ఎకరాలకు పరిమితమైన పసుపు సాగు ప్రస్తుతం 40వేల ఎకరాలను మించే అవకాశాలున్నాయని ఉద్యాన శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్న నేపథ్యంలో జిల్లాలో విత్తన కొమ్ము కొరత ఏర్పడి డిమాండ్ పెరిగింది. క్వింటాలుకు రూ.4వేల నుంచి రూ.5వేల వరకు విక్రయిస్తున్నారు. ఇటు వరి నాట్లకు కోసం రైతులు విత్తనాలు కొనుగోలు చేసి నార్లు పోస్తున్నారు.

క్రైం కార్నర్

అప్పుల బాధతో ఆత్మహత్య

రామారెడ్డి: అప్పుల బాధ కారణంగా గడ్డి మందుతాగి మహిళ ఆత్మహత్య చేసుకుంది. మండలంలోని కన్నాపూర్‌తండాలో ఈ ఘటన సోమవారం చోటు చేసుకుంది. ఏఎస్సై రవీందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కన్నాపూర్ తండాకు చెందిన నాంగోత్ గంగి(49) అప్పులు ఎక్కువ కావడంతో జీవితంపై విరక్తిచెంది సోమవారం తన ఇంట్లో గడ్డి మందుతాగింది. గమనించిన భర్త, బంధువులు ఆమెను కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి



బీబీపేట: పిల్లర్ గుంతల కోసం ట్రాక్టర్ సహాయంతో గుంతలు తీస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. సీఐ సంపత్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పిల్లర్ గుంతలు(పైలింగ్) తీసే పని చేసే ఎడపల్లి మండలం కుర్నాపల్లికి చెందిన ఎర్ల సాయికుమార్ (28) బీబీపేటకు చెందిన రెడ్డిశెట్టి శ్రీనివాస్ భూమిలో గుంతలు తీస్తున్నాడు. ఈ క్రమంలో ట్రాక్టర్‌కు ఉన్న మిషన్‌ను పైకి లేపగానే పైన ఉన్న విద్యుత్ వైర్లు తగిలాయి. ఈ ఘటనలో తీవ్రగాయాలపాలైన సాయికుమార్ ఘటనాస్థలంలోనే మృతి చెందాడు. మృతుడి తండ్రి నాగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పంచలోహ విగ్రహాల చోరీ

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రానికి సమీపంలోని జాతీయ రహదారిపై ఉన్న అయ్యప్పస్వామి సన్నిధానంలోని నాలుగు పంచలోహ విగ్రహాలను దుండగులు ఎత్తుకెళ్లినట్లు భక్తులు తెలిపారు. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మద్నూర్ సమీపంలోని అయ్యప్ప స్వామి సన్నిధానం తాళాలను దుండగులు ఆదివారం రాత్రి పగులగొట్టి స్టీల్ డబ్బాలో ఉంచిన సుమారు 20 కిలోల బరువు ఉన్న అయ్యప్ప, సుబ్రమణ్య స్వామి, రెండు గణపతి పంచలోహ విగ్రహాలను ఎత్తుకెళ్లారు. సోమవారం రాత్రి వరకూ చోరీ జరిగినట్లు ఎవరూ గమనించలేదు. ఆలయ తలుపులు తెరిచి ఉండడంతో రోడ్డున వెళ్తున్న వారు గమనించి భక్తులకు, పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఆలయానికి చేరుకున్నారు. చోరీకి గురైన విగ్రహాల విలువ సుమారు రూ.2లక్షల వరకు ఉంటుందని భక్తులు తెలిపారు. పోలీసులు మంగళవారం ఉదయం క్లూస్ టీంను రప్పించి విచారణ చేపట్టారు.

హడలెత్తించిన పిడుగులు

- బీఎస్ఎన్ఎల్ టవర్, తాటి చెట్టు దగ్ధం
- నాళేశ్వర్‌లో ఆవు మృతి


దగ్ధమైన వైర్లను తొలగిస్తున్న బీఎస్ఎన్ఎల్ సిబ్బంది

తాడ్వాయి/సిరికొండ/నవీపేట: ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకొని పిడుగులు పడడంతో ప్రజలు హడలెత్తారు. మంగళవారం మధ్యాహ్నం పలు చోట్ల ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. పలు చోట్ల పిడుగులుపడ్డాయి. తాడ్వాయి మండల కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో పిడుగుపడడంతో వైర్లు దగ్ధమయ్యాయి. ఫైర్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. కాలిపోయిన వైర్లను బీఎస్ఎన్ఎల్ సిబ్బంది తొలగించారు. సిరికొండ మండలం గడ్కోల్‌లో తాటిచెట్టుపై పిడుగు పడినట్లు గ్రామస్తులు తెలిపారు. పక్కనే ఉన్న కనకాగౌడ్ ఇంటి గోడలు స్వల్పంగా బీటలువారాయి. ఇంట్లోని ఫ్యాన్లు కాలిపోయినట్లు బాధితుడు తెలిపాడు. నవీపేట మండలం నాళేశ్వర్‌లో పిడిగుపాటుకు ఆవు మృతి చెందింది. మృతి చెందిన ఆవు విలువ రూ.30వేలు ఉంటుందని బాధితుడు జంగం రాజేశ్వర్ తెలిపాడు.

9 నిమిషాల్లో రూ.25 లక్షలు చోరీ

- గ్యాస్ కట్టర్‌తో ఏటీఎం ధ్వంసం
- గ్లాస్ డోర్, సీసీ కెమెరాపై బ్లాక్ కలర్ స్ప్రే
- ముందుగా రెక్కీ నిర్వహించిన దుండగులు
- బాల్కొండలో ఎస్‌బీఐ ఏటీఎంలో ఘటన


దుండగులు ధ్వంసం చేసిన చేసిన ఏటీఎం


వివరాలు సేకరిస్తున్న డాగ్ స్క్వాడ్

బాల్కొండ: పక్కా ప్లాన్‌తో వచ్చిన దుండగులు ఏటీఎంను కొల్లగొట్టారు. కేవలం 9 నిమిషాల్లో సుమారు రూ.25లక్షల నగదును ఎత్తుకెళ్లారు. ఈ ఘటన బాల్కొండ మండల కేంద్రంలోని వన్నెల్(బీ) చౌరస్తాలో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. సోమవారం అర్ధరాత్రి 2.22గంటలకు కియాసెల్‌టాస్‌లో వచ్చిన నలుగురు దుండగులు ముందుగా ఏటీఎం కెమెరాతోపాటు గ్లాస్ డోర్‌పై బ్లాక్ కలర్ స్ప్రే చేసి వెళ్లారు. అరగంట తరువాత వచ్చి ఒకరు వాహనంలో కూర్చోగా, మిగతా ముగ్గురు మాస్కులు ధరించి గ్యాస్ కట్టర్‌తో లోనికి ప్రవేశించారు. ఏటీఎంను ధ్వంసం చేసి అందులోని రూ.24,92,600 నగదుతో కారులో పరారయ్యారు. ఏటీఎం వద్దకు అర్ధరాత్రి 2.22 నిమిషాలకు వచ్చిన దుండగులు 2.31 నిమిషాల వరకు తమ పని పూర్తి చేశారు. కేవలం 9నిమిషాల వ్యవధిలోనే ఏటీఎంను గ్యాస్ కట్టర్‌తో ధ్వంసం చేసి చోరీకి పాల్పడినట్లు సీసీ ఫుటేజీలో రికార్డయ్యింది. తెల్లవారుజామున 5.30గంటలకు స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీం సహాయంతో వేలిముద్రలను సేకరించారు. డాగ్‌స్క్వాడ్ నిర్మల్ రోడ్డులో అంబేడ్కర్ చౌరస్తా వద్దకు వెళ్లి తిరిగి ఆర్మూర్ వైపునకు వచ్చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ఏసీపీ అన్నారు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన వారిలో రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై గోపి ఉన్నారు.

ప్రొఫెషనల్ దొంగల పనేనా?

సినీ తరహాలో ఏటీఎం చోరీకి పాల్పడింది ప్రొఫెషనల్ దొంగల పనేనని పలువురు పేర్కొంటున్నారు. పక్కా ప్లాన్ ప్రకారం పెద్ద వాహనంలో వచ్చిన దుండగులు తమ వెంట గ్యాస్ కట్టర్ తీసుకు వచ్చారు. ఏటీఎం వద్ద రెక్కీ నిర్వహించి కేవలం తొమ్మిది నిమిషాల వ్యవధిలోనే ఏటీఎంను ధ్వంసం చేసి నగదును ఎత్తుకెళ్లారు. 2022 జూలై నెలలో మెండోరా మండలం బుస్సాపూర్‌లోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో కూడా ఇదే తరహా చోరీ జరిగింది. గ్యాస్ కట్టర్‌తో లాకర్లను ధ్వంసం చేయగా నగదు కాలి బూడిదయ్యింది. దీంతో దుండగులు 8 కిలోల బంగారు ఎత్తుకెళ్లారు. అంతకు రెండుమూడు రోజుల ముందు సిద్దిపేట జిల్లాలోని కుకునూర్‌పల్లి ఎస్‌బీఐ ఏటీఎంలో భారీ చోరీ చేశారు. యూపీకి చెందిన గ్యాంగ్ రెండు చోట్ల చోరీకి పాల్పడింది. తాజాగా బాల్కొండలో ఇదే తరహా చోరీ జరిగింది. దీంతో యూపీ గ్యాంగ్ చోరీకి పాల్పడి ఉంటుందని పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అలారం సిస్టం, సెక్యూరిటీ లేకపోవడంతోనే దుండగులకు చోరీ సులువైందని స్థానికులు అంటున్నారు.

మద్యం మత్తులో కాలువలోకి దిగి మృతి


బాల్‌సాయిలు (ఫైల్)

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండల కేంద్రం శివారులోని నిజాంసాగర్ ప్రధాన కాలువలో చాకలి బాల్‌సాయిలు(35) అనే వ్యక్తి మృతి చెందాడు. మంగళవారం చోటుచేసుకున్న ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.. గున్కుల్ గ్రామానికి చెందిన బాల్‌సాయిలుతోపాటు ఆయన స్నేహితుడు గంగారాం ప్రధాన కాలువ కట్ట వద్దకు వచ్చారు. అప్పటికే మద్యం సేవించి ఉన్న ఇద్దరు స్నానం చేసేందుకు కాలువలోకి దిగారు. ఈక్రమంలో నీటిప్రవాహానికి సాయిలు కొట్టుకుపోవడంతో గంగారాం ఒడ్డుకు చేరుకొని అక్కడి నుంచి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో కాలువ వద్దకు చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులతోపాటు స్థానికులు గాలింపు చర్యలు చేపట్టారు. నీటిప్రవాహం అధికంగా ఉండడంతో నీటిపారుదలశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన వారు నీటి విడుదలను నిలిపివేయడంతో గాలింపు సులభమైంది. చివరకు సాయంత్రం 6.30గంటలకు బాల్‌సాయిలు మృతదేహం లభించింది. మృతుడికి భార్య అనసూయ, కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.